

గోదావరికి జలకళ

బాసరలోని గోదావరి నది జలకళను సంతరించుకుంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. 10లో▸



బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

బాసర జ్ఞానసరస్వతీ అమ్మవారి చెంత వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ఆర్జీయూకేటీలోనూ కుక్కల బెడద తీవ్రమై విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. 11లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 27.0 /24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మంత్రి తుమ్మలను కలిసిన డీసీసీబీ వైస్ చైర్మన్



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రఘునందన్‌రెడ్డి

లక్ష్మణచాంద: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రుణమాఫీ చేసినందుకు, రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక నిధులు కేటాయించినందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులకు పక్షాన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నాయకుడు సాయినాథ్‌రెడ్డి ఉన్నారు.

ఆర్పీలకు ఒక్కరోజు శిక్షణ



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కస్బా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఆర్పీల ఒక్కరోజు శిక్షణను డీఈవో రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఫలితాల్లో రాష్ట్ర స్థానం మెరుగుపరుచుకోవడానికే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణను సీఆర్పీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యసన ఫలితాలు సాధించేందుకు తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన పద్ధతులే దోహదం చేస్తాయని వివరించారు. ఏసీజీ పద్మ, జీసీవో సలోమి కరుణ, ఎంఈవో శంకర్, ఏఎంవో నర్సయ్య, డీఎస్వో వినోద్‌కుమార్, కోర్సు ఇన్‌చార్జి పరమేశ్వర్, విజయ్‌కుమార్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

విద్యారంగానికి అన్యాయం



బడ్జెట్ పత్రాలు దహనం చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిగంబర్, నవీన్ ఆరోపించారు. ఇందుకు నిరసనగా శుక్రవారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం ఆవరణలో బడ్జెట్ పత్రాలు దహనం చేశారు. గత బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.21,292 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు నవీన్, రాహుల్, కార్తిక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముథోల్: మండల కేంద్రంలో గత సంవత్సరం ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణకు స్థానిక ప్రభుత్వ గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం డీటీఎస్‌వో అంబాజీ పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం భవనాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సుధాకర్, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులున్నారు.


డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన




నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

భైంసాటౌన్: పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం గృహ సముదాయం వద్ద పలువురు లబ్ధిదారులు శుక్రవారం ఆందోళనకు దిగారు. మౌలిక వసతులు కల్పించి వెంటనే ఇండ్లు అప్పగించాలని డిమాండ్ చేశారు.


స్థూల జాతీయోత్పత్తి (2022-23) ప్రస్తుత ధరల్లో (రూ.కోట్లలో)




తలసరి ఆదాయం (2022-23) (విలువ రూ.)



జిల్లాల వారీగా సగటు భూకమతం (ఎకరాల్లో)



అడవుల పెంపు కోసం నిధుల ఖర్చు (2014-15 నుంచి 2023-24 విలువ శాతంలో)



కాస్త మెరుగు!

- జీడీడీపీ, తలసరి ఆదాయంలో స్వల్ప వృద్ధి
- గడిచిన పదేళ్ల అభివృద్ధిలో కాస్త ఊరట
- రాష్ట్రంలోని జిల్లాలతో పోలిస్తే ఇంకా వెనుకబాటే
- సామాజిక ఆర్థిక ముఖచిత్రం–2024లో వెల్లడి



రోడ్ల సాంద్రత (2023-24)

నిర్మల్ 71.2
ఆదిలాబాద్ 71.0
మంచిర్యాల 68.9
కుమురంభీం 66.0

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆర్థిక, సామాజిక వృద్ధిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంకా ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. ఆదాయ, ఉత్పత్తి, వినియోగం తదితర రంగాల్లో ఆశించిన మేర అభివృద్ధి జరగడం లేదు. గతంతో పోలిస్తే కాస్త మెరుగుపడినా, ఇంకా ఎంతగానో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. నాలుగు జిల్లాల పరిధిలో కుమురంభీం అన్నింటా వెనుకబడి ఉండగా, మంచిర్యాల, నిర్మల్ ముందంజలో ఉన్నాయి. ఇక రాష్ట్రంలో 33 జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి జిల్లా ఎంతో మెరుగుపడ్సాలింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ముందు ఏటా విడుదల చేసే సామాజిక ఆర్థిక ముఖ చిత్రం 2024లో ఈ వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

స్వల్పంగానే వృద్ధి..

స్థూల జిల్లా జాతీయోత్పత్తిలో ఇంకా పెరుగుదల అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఒక జిల్లా పరిధిలో ఏడాదిలో జరిగిన అంతిమ, వస్తుసేవల ఉత్పత్తిని ఆ జిల్లా జాతీయోత్పత్తిగా గుర్తిస్తారు. ఉమ్మడి జిల్లాలో జీడీడీపీ (గ్రాస్ డిస్ట్రిక్ డొమెస్టిక్ ప్రొడక్ట్స్) చూస్తే, ఇంకా అంతరాలు కనిపిస్తున్నాయి. కుమురంభీం, మంచిర్యాల మధ్య సగం వరకు వ్యత్యాసం ఉంది. రాష్ట్రంలో 33 జిల్లాల్లో రంగారెడ్డి జిల్లా టాప్‌లో ఉండగా, మంచిర్యాల 18, ఆదిలాబాద్ 24, నిర్మల్ 25, కుమురంభీం జిల్లా 32వ స్థానంలో నిలిచాయి. అంటే రాష్ట్రంలో అధిక ఆదాయం నమోదయ్యే మొదటి ఐదు స్థానాల్లో ఉమ్మడి జిల్లా లేకపోవడం గమనార్హం. గడిచిన రెండేళ్లుగా కుమురంభీం జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి రెండో స్థానానికే పరిమితం కావడం వెనుకబాటుతనానికి నిదర్శనం.

‘తలసరి’లో అంతరాలు

జిల్లా జనాభాను ఆ జిల్లా జాతీయోత్పత్తితో భాగిస్తే వచ్చేదే జిల్లాలోని పౌరుల తలసరి ఆదాయం. ఉమ్మడి జిల్లాలో తలసరి ఆదాయంలోనూ అంతరాలు కనిపిస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో ఎక్కువగా ఉంది. అయితే కుమురంభీం జిల్లాలో జనాభా తక్కువగా ఉండడంతో తలసరి ఆదాయం పెరిగినట్లుగా కనిపిస్తుంది. రాష్ట్రంలో రంగారెడ్డి ప్రథమ స్థానంలో ఉండగా, మంచిర్యాల 18, నిర్మల్ 21, ఆదిలాబాద్ 22, కుమురంభీం జిల్లా 32 స్థానాల్లో నిలిచాయి. అంటే జిల్లా పౌరుల సగటు ఆదాయం ఇంకా తక్కువగానే ఉంది.

సగటు కమతం తక్కువే..

ఉమ్మడి జిల్లాలో భూమి సాగుదారుల మధ్య ఇంకా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. సగటు కమతం చూస్తే అతితక్కువగా ఉంది.

అడవుల రక్షణ మెరుగు

అడవుల రక్షణ, పెంపు కోసం గడిచిన పదేళ్లలో నిధుల ఖర్చు క్రమంగా పెరుగుతోంది. దీంతో జిల్లాలో అడవుల పెంపునకు దోహదపడుతోంది. ముఖ్యం ‘కంపా’ (కంపెన్సెటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ) కింద నిధులు ఖర్చు చేస్తున్నారు. దీంతో అడవులు వృద్ధి చెందుతున్నాయి.

ఆదుకుంటున్న ఉపాధి హామీ పథకం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ కనీసం ఏడాదిలో వంద పని దినాలు కల్పించాలనే లక్ష్యంగా కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం జిల్లాలో మెరుగుపడుతోంది. కూలీల పని దినాల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. ఎంచుకున్న లక్ష్యం, కూలీల నమోదులో వృద్ధి కనిపిస్తోంది.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం..

ఏటేటా ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలతో క్రమంగా విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. గృహావసరాలతోపాటు వ్యవసాయ, వ్యాపార, పరిశ్రమ ఆధారిత కనెక్షన్లలో వృద్ధి కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే విద్యుత్ కనెక్షన్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

రోడ్డు సౌకర్యం మెరుగు

రోడ్ల సాంద్రత మెరుగుపడుతోంది. ప్రతీ కిలోమీటర్‌కు వంద చ.కి.మీకు ఉన్న రోడ్లు అందుబాటులో ఉన్న తీరును పరిగణిస్తే, జిల్లా జనాభాకు ఇంకా సరిపడా రోడ్లు విస్తరించాల్సి ఉంది. నిర్మల్‌లో అధికంగా, కుమురంభీంలో తక్కువగా రోడ్ల సాంద్రతను కలిగి ఉన్నాయి.

ప్రజా పంపిణీ వ్యవస్థ

ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ జిల్లాలో అధికంగానే నిత్యావసరాల పంపిణీ జరుగుతోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రతినెలా చౌక ధరల దుకాణాల్లో బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతోంది. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నమోదు, గ్యాస్ వాడకం పెరుగుతూ వస్తోంది.

మొత్తం స్కూళ్లు (2022-23)

జిల్లా	స్కూల్స్
ఆదిలాబాద్	1,433
కుమురంభీం	1,239
మంచిర్యాల	1,044
నిర్మల్	1,036

అంగన్‌వాడీ కేంద్రాలు (2023-24)

జిల్లా	అంగన్‌వాడీ సెంటర్లు	నమోదైన పిల్లలు
ఆదిలాబాద్	1,256	52,673
కుమురంభీం	973	40,931
మంచిర్యాల	969	40,919
నిర్మల్	926	49,884

‘ఉపాధి హామీ’ పని దినాలు (లక్షల్లో)

జిల్లా	లక్ష్యం	నమోదు	చేరుకుంది
మంచిర్యాల	22.5	27.5	122%
ఆదిలాబాద్	36.6	44.6	122%
కుమురంభీం	31.7	37.7	119%
నిర్మల్	52.5	56.8	108%


జిల్లాలవారీగా విద్యుత్ కనెక్షన్లు.. (లక్షల్లో)

జిల్లా	డొమెస్టిక్	వ్యవసాయం	పరిశ్రమ, ఇతర
కుమురంభీం	81.5	7.6	10.9
ఆదిలాబాద్	76.3	11.6	12.1
మంచిర్యాల	74.8	13.4	11.7
నిర్మల్	68.8	20.8	10.4

రేషన్ కార్డులు...(2023-24)

జిల్లా	రేషన్ దుకాణాలు	మొత్తం రేషన్ కార్డులు
ఆదిలాబాద్	356	1,91,761
కుమురంభీం	308	1,39,775
మంచిర్యాల	423	2,19,180
నిర్మల్	412	2,08,463

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే



డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: డీజీపీ జితేందర్‌ను హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం ముథోల్ ఎమ్మెల్యే పీ రామారావు పటేల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజకవర్గంలో శాంతిభద్రతలపై చర్చించారు. పోలీస్ యంత్రాంగానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ముథోల్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని పేర్కొన్నారు.

‘డయల్ 100’ను వినియోగించుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ, పోలీసులు

నిర్మల్ రూరల్: జిల్లాలో ‘డయల్ 100’ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎస్పీ జానకీషర్మిల పోలీసులకు సూచించారు. శుక్రవారం డీజీపీ జితేందర్ అన్ని జిల్లాల ఎస్పీలతో ‘డయల్ 100’ గురించి సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి మానిటరింగ్ చేస్తామని చెప్పారు. పోలీస్‌శాఖ తరపున జిల్లాలో అత్యవసర సమయాల్లో సేవలందించాలని సూచించారు.

ఘనంగా కార్గిల్ దివస్



మొక్క నాటుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలో కస్బా ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్ దివస్ నిర్వహించగా డీఈవో రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు పరేడ్ నిర్వహించారు. మౌనం పాటించి వీర సైనికులకు నివాళులర్పించారు. అనంతరం డీఈవో సైనికుల గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం వాణి, జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పద్మ, ఎంఈవో శంకర్, ఎన్‌సీసీ అధికారి సాయన్న, నోడల్ అధికారి పరమేశ్వర్, ఉపాధ్యాయులున్నారు.

విద్యార్థుల నృత్య ప్రదర్శన

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీకళానిలయం, యోగేశ్ డ్యాన్స్ అకాడమీలకు చెందిన విద్యార్థులు టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో శుక్రవారం నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ అధికారులు వీరికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు.

వ్యాధుల కాలం..!



జిల్లా కేంద్రంలో ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

- పెరుగుతున్న దోమలు, ఈగలు
- విషజ్వరాల బారిన జిల్లా ప్రజలు
- జిల్లాలో 12డెంగీ కేసులు నమోదు
- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ

నిర్మల్‌చైన్‌గేట్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని అనేకచోట్ల మురుగునీటి గుంతలు, డ్రెయినేజీల్లో నీరు నిలుస్తోంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మూడు డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. భైంసా పట్టణంలో రెండు, నిర్మల్ పట్టణంలో ఒక కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఈ కేసుల సంఖ్య పెరిగే అవకాశ ముంది. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. సంబంధిత అధికారులు సమన్వయంతో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు.

దోమల నివారణకు ఫాగింగ్

మున్సిపల్, పట్టణ అర్బన్ ఏరియాల్లో అధికారులు, సిబ్బందిని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ విషజ్వరాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నారు. దోమల లార్వా ఉన్న మురుగు కాలువలు, నీటి గుంతలను గుర్తించి వాటిని నిర్మూలించడానికి అవసరమైన మందు పిచికారీ చేయిస్తున్నారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించి ట్యాంకులు, నీటి గుంతలు, కాలువలు, డ్రమ్ములు, పూల కుండీలు, పాత టైర్లలో నిలిచిన నీటిని పారపోయించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. డ్రైడే పాటించి ఇప్పటివరకు సుమారు ఆరువేలకు పైగా ఇళ్లల్లో నిల్వ ఉన్న మురుగునీటిని పారబోయించారు. తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బందితో కలిసి ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పైపులైన్ లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నారు.

దోమల నివారణే కీలకం

సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులకు మూలం దోమ కాటు. అందుకే ముందస్తుగా దోమల నివారణ చర్యలు ప్రారంభించాలి. దోమల అభివృద్ధికి కీలకమైన పారిశుద్ధ్య నిర్వహణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. మురుగుకాలువలు, నీటి గుంతలు శుభ్రం చేయించడంతో దోమలను లార్వా దశలోనే అంతమొందించేందుకు కిరోసిన్, ఇతర ద్రావణాలు వేసే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఏజెన్సీ ప్రాంతంలో దోమ తెరలు పంపిణీ చేయాలి.

రోజూ ఫాగింగ్ చేయిస్తున్నాం



జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. దోమ కాటుతో డెంగీ రాకుండా జిల్లా కేంద్రంలో రోజూ మూడు వార్డుల చొప్పున ఫాగింగ్ చేయిస్తున్నాం. పట్టణ ప్రజలు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఎవరికైనా డెంగీ సోకితే మున్సిపల్ అధికారులకు సమాచారమివ్వాలి.

– దేవిదాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నిర్మల్

అప్రమత్తంగా ఉన్నాం



విషజ్వరాలపై వైద్యారోగ్యశాఖ అప్రమత్తంగా ఉంది. ఇప్పటికే దోమలు, ఈగల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు తీసుకున్నాం. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మంగళ, శుక్రవారాలను డ్రైడేగా పాటించాలి.

– ధనరాజ్, డీఎంహెచ్‌వో

నాణ్యమైన పోషకాహారం అందించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమం, వైద్యారోగ్యశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రక్తహీనత నియంత్రణకు ప్రతీ చిన్నారి, గర్భిణికి బాలామృతం, పోషకాహారం అందించాలని సూచించారు. ప్రతీ చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ కేంద్రంలో తప్పనిసరిగా డైట్ చార్టులు ఉంచాలని, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రాల్లో చిన్నారులను ఆకట్టుకునేలా పెయింటింగ్స్, బొమ్మలు, ఇతర ఆట వస్తువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. సూపర్‌వైజర్లు నిరంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తూ, చిన్నారుల హాజరు, మెనూ వివరాలు పంపించాలని ఆదేశించారు. ప్రతీ కేంద్రంలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను జియో ట్యాగింగ్ చేసి నివేదికలు అందజేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి నాగమణి, డీఎంహెచ్‌వో ధనరాజ్, సీడీపీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధిస్తాం



మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు సభ్యత్వ రశీదులు అందజేస్తున్న నరేంద్రబాబు

లక్ష్మణచాంద: త్వరలోనే ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను సాధిస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీల్లో జరిగిన పొరపాట్లను 15రోజుల్లో పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ వరకు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్ చెల్లింపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అరవింద్‌కుమార్, నాయకులు చింత మోహన్, పరమేశ్వర్, సాయిప్రసాద్, కిష్టయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోదావరికి జలకళ



నదిలో తెప్పలు వదులుతున్న భక్తులు

బాసర: బాసరలోని గోదావరి నది జలకళ సంతరించుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రా ంతమైన మహారాష్ట్రలోని ధర్మాబాద్ బాబ్లీ ప్రాజెక్టు నుంచి భారీగా వరదనీరు గోదావరి నదిలోకి చేరుతోంది. ఇక్కడి నుంచి దిగువన ఉన్న ఎస్సారెస్పీలో కి వెళ్తుంది. బాసరతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు శుక్రవారం గోదారమ్మకు పూజలు నిర్వహించారు. పిండి వంటకాలు తయారు చేసి గడ్డితో చేసిన తెప్పలను నదిలో వదిలారు. గోదారమ్మకు నైవేద్యం సమర్పించి పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.

'కడెం'కు తగ్గిన వరద



కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ప్రాజెక్టుకు 3,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో, ఒక వరద గేటు ద్వారా 4,657 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603 టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 692.650(5.826టీఎంసీ) అడుగులు ఉంది.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇల్లు

లక్ష్మణచాంద: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని బ్రహ్మదండి ముత్తవ్వకు చెందిన ఇల్లు శుక్రవారం కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఇల్లు కూలడంతో రోడ్డుపై వచ్చామని, ప్రభుత్వం ఆదుకోవాలని ముత్తవ్వ కోరింది.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి



దయాకర్‌రెడ్డి (ఫైల్)

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ క్లెం దయకర్‌రెడ్డి (51) గుండెపోటుతో మృతిచెందారు. గురువారం అర్ధరాత్రి గుండెపోటు రాగా, ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కోలుకున్నాక టీచర్స్‌కాలనీలోని నివాసానికి తరలించారు. శుక్రవారం ఉదయం మరోసారి అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయన అంత్యక్రియల్లో రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

మీరే మాకు స్ఫూర్తి



ఆల్ ది బెస్ట్ తెలుపుతున్న ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు

- గిరిజన క్రీడా పాఠశాలలో ఒలింపిక్స్ సెలబ్రేషన్స్
- భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులు



ఆసిఫాబాద్‌రూరల్: పారిస్‌లో ప్రారంభమైన ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనే భారతదేశం నుంచి పాల్గొనే క్రీడాకారులు సత్తాచాటి పతకాలు సాధించాలని ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆల్ ది బెస్ట్ చెప్పారు. పాఠశాలలో ఒలింపిక్స్ సెలబ్రేషన్స్ జరిగాయి. జిల్లాకేంద్రంలోని క్రీడా మైదానంలో జాతీయ పతకాలు చేతపట్టుకొని చీర్ ఫర్ ఇండియా నినాదంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీటీడీవో రమాదేవి మాట్లాడుతూ భవిష్యత్తులో గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు ఒలింపిక్స్‌లో పాల్గొనాలని ఆకాంక్షించారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నారు. ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్‌వో మీనారెడ్డి, ఏటీడీవో క్షేత్రయ్య, హెచ్‌ఎం కృష్ణారావు, అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పతకం సాధించాలి



ఒలింపిక్స్ క్రీడల్లో పతకం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నాను. గత సంవత్సరంలో భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొని పతకం సాధించాలనే లక్ష్యంతో రోజు శ్రమిస్తున్నాను.

– తనిష్క్, మోడల్ స్కూల్ ఇంటర్

ఒలింపిక్స్‌లో చూడాలి



గిరిజన జిల్లా క్రీడా పాఠశాల నుంచి విద్యార్థులు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నాను. ఇప్పటి వరకు 35 మంది జాతీయస్థాయిలో పాల్గొన్నారు. పిల్లలను ఒలింపిక్స్‌లో పాల్గొనేలా తీర్చిదిద్దుతా. గిరిజన శాఖ క్రీడా పాఠశాలలను ప్రోత్సహిస్తుంది.

– రమాదేవి, డీటీడీవో

మరిన్ని పతకాలు రావాలి



పారిస్‌లో ఒలింపిక్స్ దేశం నుంచి 117 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 2021లో జరిగిన దేశం తరపున 7 మెడల్ సాధించారు. ఈ సారి మరిన్ని పతకాలు వస్తాయని ఆశిస్తున్నాం. అథ్లెటిక్స్‌లో మా స్కూల్ నుంచి ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతాను.

– విద్యాసాగర్, అథ్లెటిక్స్ కోచ్ క్రీడాపాఠశాల

ఒలింపిక్స్‌లో ఆడాలని..



మాది మారుముల గిరిజన గ్రామం దంతన్‌పల్లి. 5వ తరగతిలో క్రీడ పాఠశాలలో చేరాను. అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నా. పీటీ ఉషను ఆదర్శంగా తీసుకుని ఒలింపిక్స్‌లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నా.

– మాదావి చిన్నుబాయి 9వ తరగతి

క్రీడాల్లో రాణిస్తా



కోహినూర్ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ప్రోత్సాహంతో ఆసిఫాబాద్ స్పోర్ట్స్ స్కూ ల్‌కు వచ్చాను. ఉద యం, సాయంత్రం క్రీడల్లో మెలకువలు నేర్పిస్తున్నారు. జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ఆడాను. పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడల్లో దేశం నుంచి 117 మందిని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణిస్తా.

– శ్రీలత, 8వ తరగతి (స్పోర్ట్స్ స్కూల్)

జ్యోతిని ఆదర్శంగా తీసుకుంటా



దేశంలో తొలిసారి ఎర్రాజీ జ్యోతి హడిల్స్100 మీటర్స్ రన్నింగ్‌లో ఒలింపిక్స్‌లో పాల్గొంటుంది. గెలుపొంది దేశానికి ఆదర్శంగా నిలవాలి. జ్యోతిని ఆదర్శంగా తీసుకుని 8 మీటర్స్ హడిల్స్‌ను కోసం ప్రాక్టీస్ చేస్తున్నాను.

– నందిని, 9వ తరగతి (స్పోర్ట్స్ స్కూల్)

ఒలింపిక్స్‌పై అవగాహన



2023లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు త రుపున ఆడాను. క్రీడలంటే చాలా ఇష్టం. ఒలింపిక్స్‌పై పూర్తిగా అవగాహన వచ్చింది. వచ్చే ఒలంపిక్స్‌లో పాల్గొనేందుకు శ్రమిస్తు న్నా. ప్రతిరోజూ హ్యాండ్ బాల్ ప్రాక్టీస్ చేస్తున్నాను.

– ముత్తుబాయి (9వ తరగతి)

కారు ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



నరేశ్ (ఫైల్)



గాయపడ్డ నాగేశ్

ఆర్మూర్‌టౌన్/ఖానాపూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్ట సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి గ్రామానికి చెందిన మంత్రరాజ్యం నరేశ్(43), పారిపల్లి నగేశ్ వ్యక్తిగత పనులపై శుక్రవారం ఆర్మూర్‌కు బైక్‌పై వచ్చారు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న కారు వీరిని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో నరేశ్, నగేశ్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నరేశ్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నగేశ్‌ను మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని స్థానికులు చితకబాదారు. పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

వైన్స్‌లో చోరీ



సేకరిస్తున్న క్లూస్‌టీం, సీఐ రమేశ్

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ సమీపంలో లక్ష్మీసాయి వైన్స్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. సీఐ రమేశ్ కథనం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి 1.30 సమయంలో గుర్తుతెలియని దుండగులు సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, వైన్స్ షటర్‌ను పైకి ఎత్తి చొరబడి రూ.2.15 లక్షల విలువ గల మద్యం బాటిళ్లు తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం చిరు వ్యాపారి గమనించి వైన్స్ యాజమన్యానికి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమేశ్ క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. సీసీ ఫుటేజీకి సంబంధించిన హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. వైన్స్ యాజమాన్యం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. బజార్‌హత్నూర్, బోథ్ ఎస్సైలు నరేశ్, రాము ఉన్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని చిక్కల్‌వర్ధ గ్రామానికి చెందిన గొడం గణేశ్(22) రిమ్స్‌లో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం ..గణేశ్‌ని తల్లి మందలించిందని పంట చేనులో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కు టుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు.

మహారాష్ట్రకు చెందిన ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పల్సి గ్రామానికి చెందిన చాకటి నాగోరావు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం..నెల క్రితం కూతురి వివాహం జరిపించాడు. దీంతో అప్పుల పాలవ్వడంతోపాటు ఐదెకరాల్లో వేసిన పత్తి పంటలో గడ్డి మొలకెత్తింది. కూలీలకు చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన గురువారం తన చేనులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: స్థానిక బస్టాండ్ సమీపంలో ఈనెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సారంగాపూర్ మండలం స్వర్ణకు చెందిన ఒల్లెపు రాజు(22), తన నానమ్మ సాయవ్వతో కలిసి నర్సాపూర్(జి) మండలం రాంపూర్ నుంచి స్వగ్రామమైన స్వర్ణకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. నానమ్మని ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. తీవ్ర గాయాలైన రాజును హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు.

పిప్రి కాలనీలో ఒకరికి డెంగీ



కాలనీలో పర్యటిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీనగర్‌లో ఒకరు డెంగీ బారిన పడగా, అప్రమత్తమైన అధికారులు శుక్రవారం కాలనీలో పర్యటించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్ ఘోరి వైద్య బృందంతో కలిసి కాలనీలో పరిసరాలు పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట సీహెచ్‌వో గిరిబాబు, యూపీహెచ్‌సీ సిబ్బంది కన్నయ్య, ఇంతియాజ్, మెడికల్ ఆఫీసర్ మతిన్, హెల్త్ సూపర్‌వైజర్లు నరేశ్, అజయ్, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలున్నారు.

అనంతపూర్ అటవీ ప్రాంతం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సీసీఎఫ్ శార్వానంద్

గుడిహత్నూర్: మండలంలోని అనంతపూర్ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని బాసర సీసీఎఫ్ శర్వానంద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ద్వారా చేపడుతున్న పనులు, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్లాంటేషన్ పనులు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఇచ్చోడ ఎఫ్‌డీఓ బర్నోల, ఎఫ్‌ఆర్వో పుండలీక్ స్థానిక సిబ్బంది ఉన్నారు.

ఐటీడీఏ ఏపీవోకి నివాళి



నివాళిలర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

దస్తురాబాద్: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన పెందూర్ భీంరావ్ భద్రాచలం ఐటీడీఏ ఏపీవోగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు భీంరావ్ భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. గతంలో ఉట్నూర్ ఐటీడీఏలో విధులు నిర్వహించి ఆదివాసీ గిరిజనులకు సేవలు అందించారని కొనియాడారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



ముజీబ్‌ను రక్షించిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్ చందు

భైంసాటౌన్: జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన సయ్యద్ ముజీబ్ జీవితంపై విరక్తితో భైంసా శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు యత్నించగా, బ్లూకోల్ట్ సిబ్బంది రక్షించారు. వివరాలిలా ఉన్నాయి.. ముజీబ్ శుక్రవారం భైంసాలోని తన భార్య కోసం రాగా, కుటుంబ కలహాలతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంట్లో వెళ్లిపోయాడు. దీంతో భార్య 100కు డయల్ చేయగా, బ్లూకోల్ట్ కానిస్టేబుల్ చందు వెంటనే అప్రమత్తమై గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న ముజీబ్‌ను రక్షించాడు.

వాగులో కొట్టుకుపోయిన ఎద్దు మృతి

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో రైతు బిక్క గంగాధర్‌కు చెందిన ఎద్దు గురువారం వాగులో వరద ధాటికి కొట్టుకుపోగా శుక్రవారం కళేబరం లభించింది. కడెం వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఈ ఘటన జరిగినట్లు బాధిత రైతు తెలిపాడు. మేత కోసం రెండు ఎద్దులు తీసుకెళ్లగా, ఒకటి వాగులో కొట్టుకుపోయి మృతి చెందాయి. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కొమురంభీం చౌక్‌లో టిప్పర్ ఢీకొట్టడంతో ప్రసాద్ అనే విద్యార్థికి గాయాలయ్యాయి. శుక్రవారం ఇందిరమ్మ కాలనీ నుంచి సైకిల్‌పై పాఠశాలకు వెళ్తున్న ఆయన్ను టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

వరకట్న వేధింపు కేసులో ఒకరికి ఆరునెలల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అదనపు వరకట్నం కోసం భార్యను వేధించిన కేసులో భర్తకు ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ స్పెషల్ జేఎఫ్‌సీఎం జడ్జి దుర్గారాణి తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2017 మార్చి 6న తలమడుగు మండలం సుంకిడి గ్రామానికి చెందిన సాద పొచ్చన్న తన భార్యను అదనపు కట్నం కోసం వేధించాడు. అప్పటి రూరల్ సీఐ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో చార్జ్‌షీట్ వేయగా, ఈ కేసులో ఏడుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

షోరూం యజమానిపై కేసు

నిర్మల్‌ఖైన్‌గేట్: నిర్మల్‌లోని బజాజ్ షోరూంలో బాల కార్మికుడితో పనిచేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ 10లో భాగంగా శుక్రవారం పట్టణంలో పలు షోరూమ్, దుకాణాలు తనిఖీ చేశామన్నారు. బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ షౌకత్, కానిస్టేబుల్ నరేశ్, వజ్రమ్మ, డీసీపీవో సిబ్బంది నరేందర్, కార్మిక శాఖ అధికారి గుప్తా పాల్గొన్నారు.


ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ తనిఖీ

నిర్మల్‌ఖైన్‌గేట్: పట్టణంలోని లక్కీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ సీవీఆర్ రాజు శుక్రవారం తనిఖీ చేశారు. కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను తనిఖీ చేసి పరిసరాలు పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడంతో యజమానికి జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

108లో ప్రసవం

ముథోల్: మండలంలోని విఠోలి గ్రామానికి చెందిన గర్భిణి గంగసాగరకు శుక్రవారం పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబీకులు 108కి సమాచారం అందజేశారు. సిబ్బంది వెంటనే చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు అధికమయ్యాయి. తరోడా సమీపంలో అంబులెన్సు ఆపి ప్రసవం చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, వారిని భైంసా ఏరియాస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ పండరి, పైలట్ నస్రూల్లాఖాన్ తెలిపారు.


జలపాతాలు భళా..



చూపరులను ఆకట్టుకుంటున్న కొరిటికల్ జలపాతం



జాలువారే అందాలతో కుంటాల జలపాతం



అబ్బురపరుస్తున్న పొచ్చెర జలపాతం

ఆదిలాబాద్ జిల్లా అంటేనే అందమైన అడవులు.. ఆ మధ్యన అబ్బురపరిచే జలపాతాలు ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాల అందాలు ప్రస్తుతం పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. నేరడిగొండ మండలంలోని కుంటాల, కొరటికల్, బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతాలు నిండా నీటితో జాలువారుతూ అబ్బురపరుస్తున్నాయి. జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి పర్యాటకులు తరలివచ్చి వీక్షిస్తున్నారు. కెమెరాలు, సెల్‌ఫోన్లలో ఇక్కడి అందాలను క్లిక్‌మనిపిస్తున్నారు. ఆయా చోట్ల పర్యాటకుల సౌకర్యార్థం, రక్షణార్థం కోసం అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

– నేరడిగొండ